ప్రభుత్వానికి టోకరా!



భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 29: అక్రమార్కులు అధికారంలో ఉంటే ప్రభుత్వ సొమ్మును ఎలా పక్కదారి పట్టిస్తారనే దానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతం నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లా సివిల్ సప్లై శాఖలోని ఓ ఉన్నాతాధికారి ప్రభుత్వ సొమ్మును అక్రమంగా పక్కదారి పట్టించి రూ.కోట్లు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. 2021-22 వానాకాలం సీజన్‌కు సంబంధించి జరిగిన ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఎలాంటి ధాన్యం కొనుగోలు చేయకుండానే రైతులు కాని స్థానికేతరుల పేరుమీద ధాన్యం డబ్బులు జమ చేసినట్టు సమాచారం. ఇందులో ప్రత్యేక పాత్ర పోషించిన కాటారం మండలం బయ్యారం చెందిన ఓ మిల్లర్.. స్థానికేతరులైన తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నగదు జమ చేయించినట్టు సమాచారం.

నిబంధనలకు విరుద్ధంగా

వానాకాలం (2021-22)సీజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కొనుగోళ్లు జరిగినట్టు ఆరోపణలున్నాయి. ధాన్యం కొనకున్న కౌలు రైతుల (రైతులు కానీ స్థానికేతరుల) పేరిట ధాన్యం డబ్బులు జమ చేసినట్టు సమాచారం. ముఖ్యంగా కాటారం, మహాముత్తారం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఈ దందా పెద్దఎత్తున జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొన్న రైతు పేరిట డబ్బులు జమ చేస్తున్నప్పుడు రూ.3లక్షల కంటే ఎక్కువ విలువ ఉంటే వ్యవసాయశాఖ అధికారుల సాయంతో విచారణ జరిపి నగదు జమచేయాల్సి ఉంటుంది. కానీ కాటారం మండలంలోని ఓ కొనుగోలు కేంద్రంలో ఓ వ్యక్తి ఖాతాకు ఐదు సార్లు 75,240 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్టు దాదాపు రూ.14 లక్షలకు పైగా జమచేసినట్టు సమాచారం. అలాగే కాటారం, మహాముత్తారం మండలాల్లోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 73,320 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు చూపుతూ ఓ మహిళ ఖాతాలో దాదాపు రూ.14లక్షలకు పైగా చెల్లించనట్టు ఆరోపణలున్నాయి. దీంతో పాటు మరో మహిళ కాటారం, మహాముత్తారం మండలాల్లోని నాలుగు కొనుగోలు కేంద్రాల నుంచి 15,684 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్టు చూపి రూ.13లక్షల చెల్లింపులు చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ విధంగానే జిల్లాలోని చాలా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకుండానే డబ్బులు జమ చేసినట్టు సమాచారం. తద్వారా ఆ ధాన్యాన్ని గణపురం మండలంలోని మిల్లులకు తరలించినట్లు రికార్డుల్లో చూపించారని సమాచారం. డబ్బులు జమచేసిన వ్యక్తులు, రైతులు స్థానికేతరులని ఆరోపణలుఉన్నాయి.

కౌలు రైతుల పేరుతో

ధాన్యం కొనుగోళ్లల్లో జరిగిన అక్రమాలు జయటకు పొక్కకుండా సదరు పౌరసరఫరాల ఉన్నతాధికారి కౌలు రైతుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. ధాన్యానికి సంబంధించిన డబ్బులచెల్లింపులను కౌలు రైతుల పేరిట నమోదు చేసినట్టు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాటారం, మహాముత్తారం, మహదేవ్‌పూర్ మండలాల్లోని కొన్ని కేంద్రాల్లో దాదాపు 50మందికి పైగా స్థానికేతరులను కౌలు రైతులుగా నమోదు చేసి చెల్లింపులుచేసినట్లు తెలుస్తోంది.

- జిల్లా సివిల్ సప్లయీస్ శాఖలో అక్రమార్కులు
- పక్కదారి పట్టిన ధాన్యం కొనుగోళ్లు
- కొనకున్నా.. రైతులు కాని వారి పేరిట చెల్లింపులు
- 2021-22 సీజన్‌లో రూ.కోట్లు అక్రమార్కుల జేబుల్లోకి..
- ప్రభుత్వానికి రూ.4 కోట్లకు పైగా టోకరా వేసిన ఓ ఉన్నాతాధికారి, మిల్లర్?



జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కార్యాలయం

తెర వెనుక ఓ ఉన్నతాధికారి!

ఖరీఫ్ సీజన్ 2021-22లో ధాన్యం కొనుగోలు చేయకుండానే డబ్బులు జమ చేసిన వ్యవహారంలో జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలోని ఓ ఉన్నాతాధికారి పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. డబ్బుల చెల్లింపుల్లో కాటారం మండలం బయ్యారానికి చెందిన ఓ మిల్లర్ కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. సంబంధింత మిల్లర్ కుటుంబసభ్యుల పేరిట కుడా ధాన్యం డబ్బులు జమైనట్టు తెలు స్తోంది. ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లింపులు చేసే సమయంలో సంబంధిత అక్రమ అధికారికి ఒకే పేరు పలుమార్లు ఒకే ఖాతాతో ధాన్యంచెల్లింపులపై వస్తే చెల్లింపులు నిలిపి వేసి విచారణ చేయించాల్సి ఉంటుంది. కానీ సదరు అక్రమ అధికారి అలాంటిదేమి చేయకుండా నగదు జమ చేశారు. 2021-22 వానాకాలం సీజన్‌లో ఒక్క కాటారం, మహా ముత్తారం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనే సూమారు రూ.4కోట్ల అక్రమం జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు చేయని ధాన్యానికి డబ్బులు చెల్లించి... ఆ ధాన్యాన్ని కాటారం మండలంలోని బయ్యారం మిల్లుకు కేటాయించినట్టు రికార్డులు సృష్టించినందుకు గాను సదరు అక్రమ అధికారికి రూ.కోట్లు అందినట్టు విమర్శలున్నాయి.



సదరం.. ఇక నిరంతరం

- రోజూ స్లాట్ బుక్ చేసుకునే అవకాశం
- దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి
- భూపాలపల్లి కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం మీ-సేవ కేంద్రాల్లో ప్రతిరోజూ సదరం స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించిందని, జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇక నుంచి కొత్త సదరం స్లాట్ బుకింగ్ నిరంతర ప్రక్రియగా ఉంటుందని తెలిపారు. రెన్యూవల్ మాత్రం నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాతనే స్లాట్ బుక్ అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా మీ-సేవ ఆపరేటర్లు, వీఎల్‌ఈలు సిటిజన్ మొబైల్ నంబర్లను జాగ్రత్తగా వెరిఫై చేసి నమోదు చేయాలని సూచించారు.

నేడు రెండో విడత రైతు రుణమాఫీ ప్రారంభం

ములుగు కలెక్టరేట్, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రూ.లక్ష నుంచి రూ.లక్షన్నరలోపు రెండో విడత నిధులను ఈనెల 30న మధ్యాహ్నం 12 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

వెంకటాపురం (నూగూరు), జూలై 29: ఎల్మిడి ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టుల బంద్ సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఈసందర్భంగా మండల కేంద్రంలో వివిధ దుకాణాలు, కిరాణాషాపులు, పెట్రోల్‌బంకులు మధ్యాహ్నం వరకు తెరుచుకోలేదు. బ్యాంకులు, ఆటోలు యధావిధిగా నడిచాయి.



వెంకటాపురంలో మూసి ఉన్న దుకాణాలు



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమకారుల నిరసన

మంగపేట, జూలై 29: తెలంగాణ ఉద్యమకారులు మండల కేంద్రంలో సోమవారం నిరసనకు దిగారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని విస్మరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు గాదే శ్రీనివాసాచారి, ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరం సంతోష్, మలిదశ ఉద్యమకారుల సంఘం నాయకులు కుంట ఏడుకొండల్, గూడ వాసుదేవమూర్తి, సయ్యద్ హుస్సేన్, కౌసర్‌పాషా, కర్రి శ్రీనివాస్, బీఎం. శ్రీనివాస్, ఎస్కే. అఫ్జల్, కొమరగిరి కేశవరావు, లోడంగి లింగయ్య, ఎస్కే. అహ్మద్, రాంగాని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలోని పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

మళ్లీ పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, జూలై 29 : గోదావరి పరవళ్లు తొక్కుతోంది. తగ్గినట్టు తగ్గి మళ్లీ పెరుగుతోంది. మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద సోమవారం గోదావరి ప్రవాహం పెరిగింది. 11.2 అడుగుల మేర ఎత్తుతో పరుగులు పెడుతోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడం, మానేరు, ప్రాణహిత నదుల నుంచి వరద చేరడంతో త్రివేణి సంగమం వద్ద గోదావరి పెరిగినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రామన్నగూడెం వద్ద...

ఏటూరునాగారం రూరల్, జూలై 29: రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి సోమవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు 14.250 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నం 11 గంటలకు 14.210 మీటర్లకు గోదావరి నీటిమట్టానికి చేరి క్రమేపీ తగ్గింది. ఆ తర్వాత మూడు గంటల పాటు నిలకడగా ఉన్న గోదావరి సాయంత్రం 4 గంటల 14.230 మీటర్లకు నీటిమట్టానికి చేరి పెరుగుతోంది. పుష్కరఘాట్ వద్ద సాయంత్రం 6 గంటలకు 14.270 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- పద్నాలుగేళ్ల క్రితం మంజూరు
- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న వరంగల్ వాసులు

7

భారీ కొండచిలువ పట్టివేత

వాజేడు, జూలై 29: మండలంలోని చెరుకూరులో భారీ కొండ చిలువను గ్రామస్థులు గుర్తించారు. ప్రధాన కూడలిలోని ఓ చికెన్ సెంటర్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గమనించారు. స్థానికంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్‌కు సమాచారం అందించారు. తద్వారా ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి స్పందించారు. వెంకటాపురంలో ఉన్న స్నేక్ క్యాచర్ భార్గవ్‌కు ఆయన సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న భార్గవ్ కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. సుమారు పది అడుగుల పొడువైన ఆ కొండచిలువను టేకులగూడెం సరిహద్దులోని లొటపెటగండి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. స్నేక్ క్యాచర్ భార్గవ్‌ను స్థానికులు అభినందించారు. ఎఫ్‌బీవోలు చరణ్, వాసు, మనీషా పాల్గొన్నారు.



కొండచిలువను పట్టుకున్న స్నేక్‌క్యాచర్ భార్గవ్

గంజాయి రవాణాదారుల అరెస్టు

కృష్ణకాలనీ (భూపా లపల్లి), జూలై 29: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులు భూపాలపల్లి పోలీసులకు చిక్కారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తర లించారు. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఆయన చాంబర్‌లో సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపా లపల్లి డీఎస్పీ సంపత్‌రావు వివరాలను వెల్లడించారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు జిల్లా కేంద్రం లోని సుభాష్‌కాలనీలో సంత ప్రదేశానికి వెళ్లగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిం చారన్నారు. ఆ వెంటనే వారిని అదుపులోకి తీసుకోగా భూపాలపల్లి ముని సిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లికి చెందిన దేవర కిషోర్, మోకిడి అజయ్, హుజురాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన అరవింద్ గంజా యి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారిని అదుపులోకి తీసుకోగా 3 కిలోల 335 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. వాటి విలువ రూ.83,375 ఉంటుందపి తెలిపారు. భద్రాచలం ఇతరత్రా ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి గంజాయిని తీసుకొచ్చి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

వంటకార్మికుల పొట్టలు కొట్టొద్దు

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్

ములుగు కలెక్టరేట్, జూలై 29: సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో మధ్యాహ్న భోజన వంటకార్మికుల పొట్టలు కొట్టే ప్రయత్నాన్ని విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ములుగులో సోమవారం జరిగిన వంట కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 ఏళ్లుగా వంట కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా 8వ పేజీలో..

తీరు మారట్లే!



- అడ్డంగా దొరుకుతున్నా ఆగని సబ్‌రిజిస్ట్రార్ల చేతివాటం
- మధ్యవర్తుల ద్వారా యథేచ్ఛగా అక్రమాలు, వసూళ్లు

రాంనగర్, జూలై 29 : రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయంలో లేని సమస్యలను సృష్టించడం, ఆ తర్వాత మధ్యవర్తులను రంగంలోకి దించి బేరసారాలు చేసుకోవడం. సబ్ రిజిస్ట్రార్లకు అలవాటుగా మారిందని, ఏకంగా ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరుకుతున్నా సబ్‌రిజిస్ట్రార్లు తీరు మార్చుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని ఇళ్లు, నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకూడదని గత ప్రభుతం నిబంధనలు విధించడం వారికి కలిసివచ్చినట్లు కనిపిస్తోంది. ఇలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో సబ్ రిజిస్ట్రార్లు ఆస్తి విలువను బట్టి వసూలు చేస్తున్నారు. జిల్లాలో 13 కార్యాలయాలు ఉండగా చాలా కార్యాలయాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ముడుపులు పుచ్చుకుంటూ అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరుకుతున్నా సబ్‌రిజిస్ట్రార్లలో మార్పు రాకపోవడం విశేషం. శాఖ ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

అడ్డంగా దొరుకుతున్నా మారని తీరు

అందినకాడికి దండుకుంటూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నా సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావడం లేదనే విమర్శలున్నాయి. గత మార్చి 22వ తేదీన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా 128 గజాల స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో మధ్యవర్తి ద్వారా రూ.19,200 తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈనెల 25న పరకాల సబ్ రిజిస్ట్రార్ సుజాత వారసత్వ ఆస్తి రిజిస్ట్రేషన్ విషయంలో రూ.80వేలు మధ్యవర్తి ద్వారా తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరిపై గతంలో పలు ఆరోపణలు వచ్చినా ఏమాత్రం పద్ధతి మార్చుకోకుండా ముడుపులు పుచ్చుకుంటూ దొరికిపోవడం విశేషం. జిల్లాలో ఇంకా పలువురు సబ్ రిజిస్ట్రార్లు అక్రమ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేస్తూ అందినకాడికి దండు కుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిద్దరు సబ్ రిజిస్ట్రార్లపై లెక్కకు మించి ఆరోపణలు రావడంతో ఎక్కడ దొరికిపోతామోననే భయంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నట్టు సమాచారం. హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సబ్ రిజి స్ట్రార్లు గతంలో వారు పనిచేసిన ప్రాంతంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్నట్టు అధికారిక సమాచారం.

దృష్టి సారించని ఉన్నతాధికారులు

ఇన్ని అక్రమాలు జరుగుతున్నా శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిచ్చి నట్లవుతోంది.

నిరంతరం ఉన్నతాధికారుల నిఘా లేకపోవడం మూలంగానే పలువురు సబ్ రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. విచ్చల విడిగా రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుచున్న అక్రమాలకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

మధ్యవర్తులతో దందాలు

జిల్లాలోని చాలా కార్యాలయాల్లో మీడియేటర్ల హవా కొనసాగుతోంది. సబ్ రిజిస్ట్రార్లు వ్యక్తిగత పనుల కోసం ప్రైవే టు వ్యక్తులను నియమించుకుని వారి ద్వారా దందాల కొనసాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లాలో ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు కూడా మీడియేటర్ల ద్వారానే ముడుపులు పుచ్చుకుంటూ అడ్డంగా దొరికిన విషయం తెలిసిందే. సబ్ రిజిస్ట్రార్లతో పని కావాలంటే వారి వ్యక్తిగత ప్రైవేటు సిబ్బందిని సంప్రదిస్తే ఎలాంటి పని అయినా క్షణాల్లో పూర్తవుతుందనే విమర్శలున్నాయి. నగరంలో ఉన్న మూడు కార్యాలయాల్లో మీడియే టర్లు ఆస్తుల క్రయవిక్రయాల్లో కీలక పాత్ర పోషిస్తుంటారనే ఆరోపణలు న్నాయి. తమ వద్దకు వచ్చే వారిని సబ్ రిజిస్ట్రార్‌లు సైతం వ్యక్తిగత ప్రైవేటు వ్యక్తిని సంప్రదించాలని సూచిస్తారనే ప్రచారం ఉంది. ఎలాంటి సమస్య ఉన్నా ప్రైవేటు వ్యక్తి చక్కదిద్ది సదరు ఆస్తి రేటును బట్టి ముడుపులు వసూలు చేస్తా రని సమాచారం. మొత్తంగా చాలా కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా దందా సాగుతుందనే విమర్శలున్నాయి.

రీవాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

- కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా
- గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు

వివరాలు : 7లో..



కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

గూడూరు, జూలై 29: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కారు అతివేగంగా దూసుకువెళ్లి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. మండలంలోని దామరవంచకు చెందిన నలుగురు యువకులు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గూడూరు నుంచి మహబూబాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నాయకపల్లిలో అతివేగంగా నడుపుతూ రోడ్డుపై కుక్క ఉండడంతో ఎడమ వైపుకు వాహనం తిప్పాడు. ఎడమ వైపున ఉన్న ఓ వ్యక్తి సెల్ లైట్ వేసుకుని నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన డ్రైవర్ ఆవెంటనే మళ్లీ కుడివైపుకు తిప్పాడు. కుడివైపున ఉన్న చిన్నకంకర కుప్పపైకి వెళ్లడం, ఆవెంటనే ఎడమవైపుకు వేగంగా దూసుకెళ్తూ తొలుత కల్వర్టును ఢీకొట్టింది. ఆపై ఓ చెట్టును, హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరును కారు ఢీకొట్టి రోడ్డు కింది భాగంలోని పొలాల్లో పడింది. వాహనంలో ఉన్న ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో ముందుభాగంలో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. వాహనం నడుపుతున్న దామరవంచ తండాకు చెందిన నూనావత్ సిద్దు తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో రోడ్డువెంట మాట్లాడుతున్న గ్రామస్తులు, చిన్నపిల్లలు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి పక్క నుంచే కారు అతివేగంగా దూసుకుపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు.



ప్రమాదంలో గాయపడిన నూనావత్ సిద్దు

సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్

బోర్డుకు దరఖాస్తు చేసిన సంస్థ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణా లు గల మరింత నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో వ చ్చే విద్యాసంవత్సరం నుఏంచి సింగరేణి పాఠశాలలో సెంట్రల్ బో ర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)సిలబస్‌ను బోధించాలని ఆ సంస్థ నిర్ణయించింది. దీనికోసం తొలుతగా రామగుండం-2 ఏరియా ఇంక్లైన్ కాలనీలో ఉన్న సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సింగరేణి సంస్థ దరఖాస్తు సమర్పించింది. దీనికన్నా ముందు తెలం గాణ విద్యాశాఖనుం చి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకొని దరఖా స్తును సమర్పించింది. దాంతో పాఠశాలను పరిశీలించడానికి వీలుగా త్వరలోనే సీబీఎస్ఈకి చెందిన ఉన్నత స్థాయి బృందం రామగుండం చేరుకొని, తరగతి గదులను, పాఠశాల క్రీడా మైదానం , ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు తదితర అన్ని అంశాలను పరిశీలించి, తగి న సిఫారసులు చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి రామగుం డం లో, ఆ తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోనూ దీన్ని అందుబాటు లోకి తీసుకురావాలని నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 29 : కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని ఎంజీఎం ఆస్పత్రి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆవరణలో సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికుల సమాఖ్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 4న వరంగల్‌లో కార్మిక వర్గ హక్కుల కో సం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేత నం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణ మే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సి బ్బంది గొర్రె నాగరాజు, ఆర్.రాజు, సుధాకర్, పుష్ప, రాజవీరు, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, నాగరాజు, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.






















సీఎంకు పండుగల పంచాంగం అందజేత


సీఎంకు పండుగల జాబితాను అమ్మవారి ప్రసాదాన్ని అందించిన సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 29: తెలంగాణ విద్వత్‌సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా పండుగల నిర్వహణను తెలియజేసే 2025-26 విశ్వవసు నామ సంవత్సర జాబితా(పంచాంగం)ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం అందించారు. అలాగే, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో సభ్యులు సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్వత్‌సభ వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిలిచ్చినట్లు పేర్కొన్నారు. పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి లేకుండా జాబితాను నిర్ధారించి అందించినందుకు మంత్రి సురేఖ అభినందించారన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు(వరంగల్), యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహచార్యులు(యాదాద్రి), విద్వత్‌సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి(మేడపల్లి-నల్లగొండ), కోశాధికారి ఎంవీఆర్ శర్మ(హైదరాబాద్), వేదపండితులు నటార్‌శర్మ(వరంగల్), సాయిదీక్షిత్(వరంగల్) పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్లను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో పారిశుధ్య పనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో బీఈడీ కలిగి ఎస్జీటీలు నష్టపోయారని, వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణమయ్యాయని, వాటి నిర్వహణకు స్కావేంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, పి. మనోజ్, స్వామి, తన్వీర్, బుచ్చాచారి, అశోక్, పూర్ణ చందర్, రమేష్, రవి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం పీడీ


కొమ్ము రాజేందర్

కేసముద్రం, జూలై 29 : ప్యారిస్‌లో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరిగే పారా ఒలింపిక్స్‌కు దేశం తరపున బ్యాడ్మింటన్ క్రీడకు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా రాజేందర్ గతంలో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, బ్యాడ్మింటన్ ఏషియా, ఏషియన్ స్కూల్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడలు, మూడుసార్లు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, టాటా ఓపెన్ ఇంటర్నేషనల్, ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్, ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, నేషనల్ గేమ్స్, సౌత్ జోన్ క్రీడలతో పాటు అనేక జాతీయ స్థాయి క్రీడలకు అంపైర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. తాజాగా వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వారు టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజు, ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయ


విజయ

వడ్డెపల్లి, జూలై 29 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జా తారకం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా హనుమకొండ పట్టణానికి చెందిన చేపూరి విజయ నియమితులయ్యారు. ఆర్‌పీఐ బొజ్జా తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, ఆర్‌పీఐ వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని చేపూరి విజయ పేర్కొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, జూలై 29 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అమరవీరుల అనంతరం గళమెత్తి ఉద్యమించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కళాకారులు నిరసనగా భిక్షాటన చేశారు. వరంగల్ చౌరస్తాలో ఒక బృందం, హనుమకొండ చౌరస్తాలో ఒక బృందం కళాకారులు భిక్షాటన చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలంటూ కోరారు. రోడ్డుపక్కన ఉన్న షాపుల్లోకి వెళ్లి భిక్షాటన చేశారు. కళాకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, ఎస్ కే.రాజు, బిర్రు సురేందర్, గుండెకారి సునీల్, సదానందం, డప్పు కార్తీక్, వెంకట్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి, రాయబారపు సాంబయ్య తదితర సుమారు 100 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో పదోన్నతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు నిర్వహించగా కొన్ని ఖాళీలు మిగిలాయి. వరంగల్ జిల్లాలో 43 ఖాళీలు ఏర్పడగా హనుమకొండ జిల్లాలో సైతం 43 ఖాళీలే ఏర్పడ్డాయి. దీంతో మిగులు ఖాళీల్లో సైతం అర్హులైన ఉపాధ్యాయులకు సోమవారం పదోన్నతులు కల్పించారు. వరంగల్ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలు 4, హిందీలో 5, ఫిజికల్‌సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 9, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, తెలుగులో 7, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్‌లో 40 మంది ఉపాధ్యాయులకి మాత్రమే ప్రమోషన్ రాగా, మిగతా మూడు ఖాళీల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో 3 ఖాళీలు అలాగే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలలో 11, సోషల్ స్టడీస్‌లో 16, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో 7, ఫిజికల్ సైన్స్‌లో ఒక్కరు పదోన్నతి పొందారు. వీరందరికి సోమవారం ఆర్డర్లు ఇవ్వగా మంగళవారం పాఠశాలల్లో జాయిన్ కానున్నారు.

సీపీ పేరిట నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు

వరంగల్ క్రైం, జూలై 29 : సైబర్ నేరగాళ్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేరిట నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేశారు. నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేసి పలువురు ఖాతాదారులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. ఈ విషయమై అప్రమత్తమైన కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ పేరిట వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు ఎవరూ స్పందించకూడదని పేర్కొన్నారు. ఇది నకిలీ ఫేస్ బుక్ అని గుర్తించాలని వారు పేర్కొన్నారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్‌ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు


హైదరాబాద్‌లోని ఈ శిల్పారామం తరహాలోనే వరంగల్‌లోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు..

హన్మకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా శిల్పారామం ఏర్పాటు చేస్తామని పద్నాలుగేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు రూ.6కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేసింది. కానీ ఆ పనులు నేటికీ మొదలవలేదు. అసలు శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపైన ఏర్పడిన తకరారు ఇప్పటికీ సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని వరంగల్ నగర వాసులు పేర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సాకారం కాని తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

14 ఏళ్లనాటి కల..

నగర వాసుల శిల్పారామం కల ఇప్పటిది కాదు. పదమూడేళ్లనాటిది. నాటి ప్రభుత్వం నిధులిచ్చినా ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో స్పష్టత లేకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అనువైన స్థలం గుర్తింపులో అధికారుల వైఫల్యం గ్రహపాటుగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శిల్పారామం మంజూరైంది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఏర్పాటుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శిల్పారామం ఏర్పాటులో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత కాలంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సీఎం కేసీఆర్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్‌తో త్వరలో శిల్పారామం ఏర్పాటుపై ఇచ్చిన హామీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆయా సందర్భాల్లో చేసిన ప్రకటనలు గాలిమాటలుగానే మిగిలి పోయాయి. స్థానికంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు, పట్టణాల్లో నివసించే వారికి పల్లె వాతావరణం రుచి చూపేందుకు, వివిధ ప్రదర్శనల ద్వారా స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించేందుకు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయాలని 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌తో పాటు సంగారెడ్డి, కడప, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపూర్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు శిల్పారామం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు కసరత్తు చేసినా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

మూలుగుతున్న నిధులు

వరంగల్‌లో ఏర్పాటు చేసే శిల్పారామంలో వివిధ చేతి వృత్తుల అమ్మకానికి 40కి పైగా స్టాళ్లు, నాటక, కళా ప్రదర్శనలకు ఎపెన్ ఏయిర్ థియేటర్, ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని, శిల్పారామంలో చిన్నపాటి చెరువును ఏర్పాటు చేసి అందులో పిల్లల ఆహ్లాదానికి బోటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. అదనపు ఆకర్షణగా రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి అంచనా ప్రకారం మొత్తం రూ.12కోట్ల వ్యయం కాగా దశల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తొలి విడతగా రూ.5కోట్లను, ఆ తర్వాత రూ.కోటి 14 లక్షలను మంజూరు చేసింది. మొత్తంగా రూ.6.14కోట్లు విడుదలైనా ఇప్పటికీ అవి ఖర్చు కాకుండా మూలుగుతున్నాయి. శిల్పారామం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి లభిస్తుంది. హస్తకళాకారులు తాము తయారు చేసిన కళారూపాలకు, ప్రధానంగా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ లభిస్తుంది. పర్యాటకులు, నగరవాసులకు ఆహ్లాదం కూడా అందుతుంది.

పద్నాలుగేళ్ల క్రితం మంజూరు

స్థల ఎంపికలో తకరారు..

శిల్పారామం ఏర్పాటుకు స్థలం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో అధికారులు తుది నిర్ణయానికి రాలేక పోతున్నారు. ఇప్పటి వరకు అయిదారు చోట్ల స్థలాలను చూశారు. వీటిలో కొన్నిటిని ఖరారు చేశారు. చివరి నిమిషంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. శిల్పారామంను మొదట హన్మకొండ గోపాలపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఓ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల స్థలం ఈ స్థల సేకరణకు అధికారులు కొంత కసరత్తు చేశారు. అయితే ఈ స్థలంలో అప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినందు వల్ల శిల్పారామం ఏర్పాటు సాధ్యం కాదని భావించిన అధికారులు ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఖిలా వరంగల్ కోట సమీపంలోనూ స్థలాన్ని చూసిన అధికారులు పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లు కోటకు దగ్గరగా ఉందని, ఈ స్థలం అనుకూలమైందని భావించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. కానీ కేంద్ర పురావస్తు శాఖ అభ్యంతరం చెప్పడంతో అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. హన్మకొండ బాలసముద్రంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న అయిదు ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అయితే ఈ స్థలం సరిపోదని, పైగా ఇది ఇళ్ల మధ్యలో ఉందని అధికారులు ఆ ఆలోచనను కూడా మానుకున్నారు. నగర శివార్లలోని హసన్‌పర్తిలో ఏర్పాటు చేసే విషయమై కూడా అధికారులు పరిశీలించారు. మామునూరు సమీపంలో బెస్తం చెరువును అనుకొని జయశంకర్ స్మృతి వనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. నగరానికి 8కిలోమీటర్ల దూరంలో వరంగల్-ఖమ్మం రోడ్డును ఆనుకొని ఉన్న ఈ స్థలం శిల్పారామానికి అనువైనదిగా భావించారు. అప్పుడు కూడా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ (వైటీడీసీ) వైస్‌చైర్మెన్ కిషన్‌రావు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి ఈ స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 60 ఎకరాల్లో శిల్పారామానికి 15 ఎకరాలు కేటాయించేందుకు నాటి కలెక్టర్ వాకాటి కరుణ అంగీకరించారు. కానీ అక్కడ కూడా ఏర్పాటు కాలేదు. చివరికి 2019 సెప్టెంబరు 19న నాటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హైదరాబాద్ శిల్పారామం జనరల్ మేనేజర్ కిషన్‌దాస్ వరంగల్ హంటర్ రోడ్డులో జూపార్క్‌కు ఎదురుగా, ప్రాంతీయ సైన్స్ కేంద్రం సమీపంలో అందుబాటులో ఉన్న సుమారు 30ఎకరాలను పరిశీలించారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించారు. కానీ రెండేళ్లవుతున్నా ఓ కొలిక్కి రాలేదు. ఇక్కడ ఇప్పటికే అక్రమణలు, నిర్మాణాలున్నాయి. పైగా పూర్తిగా గుట్ట ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడానికి దారి లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ సైన్స్ సెంటర్ నుంచే వెళ్లాల్సి ఉంటుందన్న ఆక్షేపణలున్నాయి. కానీ నాడు ఎమ్మెల్యే, కలెక్టర్, వైటీడీసీ వైస్ చైర్మెన్, మాజీ ఐఏఎస్ అధికారి, ఆర్ట్ డైరెక్టర్ తదితరులు సమీక్షించడంతో పెండింగ్‌లో ఉన్న శిల్పారామానికి కూడా మోక్షం లభించనట్టేనని నగరవాసులు భావించారు. కానీ ఆ తర్వాత అంతా మొదటికే వచ్చింది. అయితే అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొంత హడావిడి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా శిల్పారామాన్ని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

వర్షాల కారణంగా టైగర్ జోన్ ఏర్పాటుకు ఆటంకం


వర్షం నీళ్లు చేరడంతో నిలిచిన టైగర్‌జోన్ పనులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 29 : వచ్చే అక్టోబరులో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్క్‌కు పెద్దపులి రానుంది. మూడు నెలల క్రితం జూపార్కులో అధికారులు టైగర్ జోన్ ఏర్పాట్లు ప్రారంభించారు. వాస్తవానికి టైగర్ జోన్ పనులు ఇప్పటికే పూర్తిచేసి జూపార్క్‌కు పెద్దపులిని తీసుకురావాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో టైగర్ జోన్ చుట్టు కంచె ఏర్పాటు చేసేందుకు గుంతలు తీయగా ఆ గుంతల్లో వర్షంనీరు చేరి పనులకు ఆటంకం కలిగింది. మూడు నెలల్లో టైగర్‌జోన్ పనులు పూర్తిచేసి పెద్దపులిని తీసుకువస్తామని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపినప్పటికీ వర్షాల కారణంగా పనులు ఇప్పటికే 70శాతం వరకు మాత్రమే పూర్తయ్యాయి. వచ్చే సెప్టెంబర్ నెల చివరి వరకు టైగర్ జోన్ పనులు పూర్తిచేసి జూపార్క్‌కు పులిని తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ అధికారులు పనులు వేగవంతం చేశారు. ఎంతోకాలంగా నగరంలో పులిని చూద్దాం అనుకునే ప్రజలకు మరో రెండు నెలల్లో పులి జూపార్కులో కనిపించనుంది.

వర్షాల కారణంగా టైగర్‌జోన్ పనులు ఆలస్యం

మయూరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



మూడు నెలల్లో జూపార్కులో టైగర్‌జోన్ పనులు పూర్తి చేసి పులిని తీసుకొద్దామనుకున్నాం. వర్షాలు పడటం వలన టైగర్‌జోన్ పనులు చేసే ప్రాంతంలో నీళ్లు నిలిచి పనులు చేయడానికి కొంతవరకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం ఇంకా ఇక్కడికి పులిని తీసుకువచ్చే కండిషన్ లేదు. పులిని కొత్త ప్రదేశానికి తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 70శాతం వరకు టైగర్‌జోన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బారికేడ్స్ పనులు జరుగుతున్నాయి. లోపల ఇంకా టైల్స్ వేయాలి. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి అక్టోబర్‌లో జూపార్కుకు పెద్దపులిని తీసుకువస్తాం.

వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు పేరుతో చోరీలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు .. రెండుకార్లు స్వాధీనం

మట్టెవాడ, జూలై 29 : వాహనాల ట్రాన్స్‌పోర్ట్ పేరుతో దొంగతనాలకు పాల్పడున్న అంతర్ రాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సోమవారం దొంగల ముఠా అరెస్టు వివరాలను ఏసీపీ వెల్లడించారు. రెండు సంవత్సరాల నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఆగ్రాకు చెందిన కృష్ణ కాంత్ సక్సేనా, రాజస్థాన్ రాఊంపాళీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమకి, వికాస్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌ఫోర్టు, పార్సల్ సర్వీస్ వారి దగ్గరకు కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు చేసేందుకు వారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌ఫోర్టు చేయుటకు వారికి వాహనం ఇచ్చినప్పుడు ముగ్గురు కలిసి వాహనం నెంబరు ప్లేట్‌ని మార్చి, వరంగల్, హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జూన్ 22న మహారాష్ట్ర గోండియా జిల్లాకు చెందిన వికాస్‌కు చెందిన ఎకోస్పోర్ట్ కారును జైపూర్‌లోని రిలీఫ్ రీ లొకేషన్ పార్సెల్ సర్వీసు వారి వద్ద నుంచి మహారాష్ట్ర గోండియాలో డెలీవరి కోసం తీసుకొని, ఆ వాహనంలో గతంలో దొంగతనాలకు పాల్పడిన విధంగా జూన్ 24న వరంగల్‌కు వచ్చి హంటర్‌రోడ్‌లోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ. 2 లక్షల విలువైన ఫినోలెక్స్ ఎలక్ట్రికల్ వైరును దొంగిలించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎకోస్పోర్ట్, మారుతి రిడ్జ్ కార్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ తెలిపారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ నవీన్ కుమార్, మట్టెవాడ క్రైమ్ పార్టీ పోలీసు సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌లను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.


అరెస్టు చూపుతున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మహాలక్ష్మీ పథకంతో పెరిగిన ఆదాయం

ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం విజయభాను


బాలసముద్రం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని వరంగల్ రీజనల్ ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం విజయభాను మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో మొత్తం 928 బస్సులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం కోసం 759 బస్సులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులలో 9 కోట్ల 46 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించగా 5 కోట్ల 78 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి మహాలక్ష్మీ స్కీంను వినయోగించుకున్నట్లు ఆయన తెలిపారు. పెరిగిన ప్రయాణికులకు గాను ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను సమయాలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా 20 రూట్లలో ప్రజలు ప్రజాపతినిధుల విజ్ఞప్తుల మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ప్రయాణికులు ప్రయాణం పెరిగిందని హైదరాబాద్, కరీంనగర్, మరి కొన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు త్వరలో 42 బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభించినప్పటి నుంచి వరంగల్ రీజియన్‌కు రూ.554 కోట్ల 63లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మహాలక్ష్మీ ప్రయాణీకుల ద్వారా రూ.293 కోట్ల 58లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రస్తుతం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు భానుకిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా

నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు



ఆన్‌లైన్‌లో రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రశీదు

కేయూ క్యాంపస్, జూలై 29 : కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత డిసెంబరులో వర్సిటీ డిగ్రీ కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్‌లో పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. అయితే చాలా మంది విద్యార్థులు తమ పరీక్షల ఫలితాలను రీవాల్యూవేషన్ చేయాలని దరఖాస్తులు వర్సిటీ అధికారులకు చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 305 చెల్లించారు. వర్సిటీకి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెల రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ తమ సబ్జెక్టులలో రీవాల్యూవేషన్, రీ కౌంటింగ్ చేసి ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు తాము దరఖాస్తులు చేసుకున్నటువంటి సబ్జెక్టు మంచిగా రాసినట్లయితే రీవాల్యూవేషన్, రీకౌంటింగ్‌లో బేనిఫిట్ పొందుతారు. లేక నాట్ బేనిఫిట్ అని ఫలితాలు వస్తాయి.

రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా వర్సిటీ అధికారులకు ఫలితాలను వెల్లడించాలనే ఊసే రావడం లేదు. దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి నెల 15 రోజుల్లో ఫలితాలను వెలువరించాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితాల కోసం విద్యార్థులు కాలం గడుస్తుండటంతో కళ్ళు కాయలు కాసేలా చూస్తున్నారు.

6వ సెమిస్టర్‌ది ఇచ్చారు.. మిగతావి మరిచారు...

ఉన్నత విద్య ప్రవేశాలకు వేళ్ళే విద్యార్థుల వెసులుబాటును ఆలోచించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డిగ్రీ 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను ఇచ్చారు. మిగతా 1, 2,3, 4, 5వ సెమిస్టర్ డిగ్రీ కోర్సులు ఫలితాలను మరిచారు. అయితే 1 నుంచి 5వ సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు తప్పిన విద్యార్థి ఉన్నట్లయితే ఉన్నత విద్య ప్రవేశాలకు అర్హత కోల్పోతారు. దీన్ని గుర్తించని వర్సిటీ అధికారులు విద్యార్థులకు లాభం చేశామనే ఉద్దేశ్యంతో కేవలం 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను వెల్లడించి చేతులు దులుపుకోవడంపై విద్యార్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తాం..

ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

వారం రోజుల్లో డిగ్రీ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను విడుదల చేస్తాం. రీవాల్యూవేషన్ ప్రాసెస్ పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దు. వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేస్తాం.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మహాముత్తారం, జూలై 29: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని బోర్లగూడెంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపర్తి బత్కయ్య కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి కాటారం వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ఇక్కింటి వారు లేచి చూడగా బత్కయ్య ఇంట్లోంచి మంటలు వస్తున్నాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది.



కాలిపోయిన ఇంటి వద్ద బత్కయ్య

తాను వడ్రంగి పని చేస్తూ జీవిస్తున్నానని, ఈ ప్రమాదంలో బైక్‌తో పాటు ఇంట్లోని సామగ్రి, తాను వృత్తిరీత్యా ఉపయోగించే యంత్రాలు దగ్ధమై రూ. 6 లక్షల నష్టం వాటిల్లిందని బత్కయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాముకాటుకు దుక్కిటెద్దు మృతి

వాజేడు, జూలై 29: పాముకాటుకు గురై దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని జంగాలపల్లిలో చోటు చేసుకుంది. బాధిత రైతు గజ్జల సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి దుక్కిటెద్దులను మేతకు తీసుకువెళ్లగా ఒకదానిని పాము కాటేసింది. మృతి చెందిన దుక్కిటెద్దు విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

బొగ్గు ఉత్పత్తికి కొనసాగుతున్న అంతరాయం

కాకతీయఖని, జూలై 29: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కురుస్తున్న వర్షం ప్రభావంతో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 2,3లలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి ఇంకా పునరుద్ధరణ కాలేదు. వర్షపు నీర క్వారీల్లో చేరడంతో కోల్ ఆపరేషన్, ఓవర్ బర్డెన్(ఓబీ) పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఉపరితల గని నుంచి బొగ్గును వెలికి తీయడం కష్టతరమైంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2లో రోజుకు 2,308 టన్నుల బొగ్గును వెలికి తీయాల్సి ఉంది, ఓసీ-3లో 4077టనున్నల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. సోమవారం టన్ను బొగ్గును కూడా వెలికి తీయలేదని ఏరియా సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీంతో ఓసీ-2,3ల ద్వార సింగరేణి సంస్థకు సుమారు రూ. 2కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో ఓవర్‌బర్డెన్ పనులు ప్రారంభమైనట్టు తెలిపారు.

పోలీసుల ముమ్మర సోదాలు

కాటారం, జూలై 29: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలోని 353(సీ)జాతీయ రహదారిపై పలు చోట్ల కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ నేతృత్వంలో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వదిలేశారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

- మేడారం: మావోయిస్టు వారోత్సవాలు, ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ నిరసిస్తూ భూపాలపల్లి, ములుగు జిల్లాల బంద్‌ను మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో తాడ్వాయి మండలం బయ్యక్కపేట పంచాయతీ పరిధి ముసలమ్మపెంట గొత్తికోయ గుంపులో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు సోదాలు చేశారు. ఇంటింటికీ తిరిగి సోదాలు చేశారు. కొత్తగా వచ్చిన వారి బంధువులను, వ్యక్తులను విచారించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
- మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి క్రాస్ వద్ద ఎస్సై మహేంద్రకుమార్ నేతృత్వంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితుల వివరాలను సేకరించారు. కొత్తవారు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.
- ఏటూరునాగారం రూరల్: మావోయిస్టు వారోత్సవాలు, ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా భూపాలపల్లి, ములుగు జిల్లాల బంద్‌ను మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.మండలంలోని రొయ్యూర్ సమీపంలోని 163వ జాతీయ రహదారిపై ఎస్సై తాజుద్దీన్ తన సిబ్బందితో కలిసి రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. కొత్త వ్యక్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.



కాటారంలో వాహనాలు చేస్తున్న సీఐ, ఎస్సై

- వెంకటాపూర్(రామప్ప) : మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని బండ్లపాడు గొత్తికోయగూడెంలో ఎస్సై జక్కుల సతీష్ నేతృత్వంలో పోలీసులు సోదాలు చేశారు. అనంతరం ఎస్సై సతీష్ గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. గూడెంలోకి ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

భద్రాచలానికి అధిక నిధులు ఇవ్వండి

కరకట్ట నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయించాలి

పార్లమెంట్‌లో మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామ మందిరానికి ఇచ్చిన విధంగానే దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి అధిక నిధులు ఇవ్వాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సోమవారం ఎంపీ బలరాంనాయక్ కోరారు. అయోధ్య రామ మందిరానికి వేలాది కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేసిన విధంగా తెలంగాణలోని భద్రాచలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. భద్రాచలంలో 25కి.మీ మేర కరకట్టను నిర్మించేందుకు రూ.3వేల కోట్లు కేటాయించాలని కోరారు. భద్రాచలం ప్రాంత ఆదివాసీలకు వరదల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. భద్రాచలం వద్ద శ్రీరాముడి పాదాలు తాకుతూ ప్రవహించే గోదావరి నదిపై కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని, వరదలు వచ్చిన సమయంలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చితే గ్రామాలు, రోడ్లు, పొలాలు కొట్టుకుపోతాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. 1983లో కట్టిన కరకట్టలు బలహీన పడడంతో వరదలు వచ్చిన సమయంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని తద్వారా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు 25కి.మీ మేర గోదావరి నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని కోరారు. అయోధ్య రాముడికి వేల కోట్లు ఖర్చు చేసిన తరహాలోనే భద్రాద్రి రాముడికి నిధులు వెచ్చించాలని ఎంపీ బలరాంనాయక్ విజ్ఞప్తి చేశారు.

డీఎంహెచ్‌వో పర్యటన

మంగపేట, జూలై 29: మండలంలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సోమవారం పర్యటించారు. కోమటిపల్లి సబ్ సెంటర్ పరిధి గొత్తికోయ గూడెంలో వైద్య శిబిరాలు నిర్వహిం చగా వాటిని పరిశీలించారు. రోగుల సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించారు. రేగులగూడెంలో పర్యటించిన ఆయన గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ కార్యదర్శి పాషాకు సూచించారు. అలాగే దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. శనిగకుం టలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. మల్లూరు, మంగపేటలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లు, మంగపేటలో నిర్వహిస్తున్న రక్త పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నేతలను డీఎంహెచ్‌వో కలిశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని వారిని కోరారు. వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు పాటించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు నిఖిల్‌కుమార్, వైశాలి, యమున హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూలై 29: మండలంలోని ఎదిర గ్రామంలో సోమవారం కాఫెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు, అటవీ ఫలాలపై ప్రజలకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా అటవీ శాఖ అధికారి కిరణ్ మాట్లాడుతూ అడవిలో లభించే అటవీ ఫల ఉత్పత్తులు, ఔషధ మొక్కలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గొంది హనుమంతు, ఇందిర, కామేష్, ప్రశాంత్, పద్మ, ఉషరాణి, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ పోతే ఆందోళన చెందొద్దు

ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం రూరల్, జూలై29: సెల్ ఫోన్లు అపహరణకు గురైనా, ఎక్కడైనా పోగొ ట్టుకున్నా ఆందోళన చెందొద్దని, వాటి రికవరీ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టీంను ఏర్పా టు చేశామని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న 11 మందికి రికవరీ చేయగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాటిని అప్పగించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి, ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఫోన్ల రికవరీకి విశేషంగా కృషి చేస్తున్న కానిస్టేబుల్ హరీశ్, శ్రీనివాస్‌ను ఏఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో వైద్య పరీక్షలు



మహదేవపూర్‌లో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మహదేవపూర్, జూలై 29 : మండల కేంద్రంలోని బీసీ బాలుర, ఎస్టీ బాలికల హాస్టళ్లలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 53 మందిని పరీక్షించి అందులో ముగ్గురి రక్త నమూనాలు సేకరించారు. వివిధ అనారోగ్య సమస్యలకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హరిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య రక్షణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెల్‌కల అసిస్టెంట్ అడప రాజరమణయ్య, ఎఎన్ఎం హేమలత, వెంకటమ్మ, బీసీ బాలుర హాస్టల్ సాంబయ్య, ఎస్టీ హాస్టల్ వార్డఎన్ సరిత, ఆశ వర్కర్లు శైలజ, మాధవి, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శిబిరాలు

వెంకటాపురం(నూగూరు): మండలంలోని రామచంద్రాపురం, రాచపల్లి, వీరభద్రవరం, ఉప్పేడువీరాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్య శిబిరాలు జరిగాయి. ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. ప్రజలు సీజనల్‌వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వైద్యులు సోహెల్, వినయ్, ఆశీష్, స్నేహ, సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వంటకార్మికుల పొట్టలు కొట్టొద్దు

5వ పేజీ తరవాయి

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నారని, బిల్లులు సకాలంలో రాకున్నా నిర్విరామంగా అందిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఈవిషయమై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రాష్ట్రంలో ఉన్న 54 వేల వంటకార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా పునరాలోచన చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఈనెల 31న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లాలోని మధ్యాహ్న భోజన వంట కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



గుంతలు ఏర్పడి అధ్వానంగా మారిన రోడ్డు

కాటారం, జూలై 29: మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వడ్లోని వాగు బ్రిడ్జి వద్ద, జిన్నింగ్ మిల్లు సమీపంలో, శంకరంపల్లి స్టేజీకి సమీపంలో భారీ వర్షాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వర్షాలతో లోతైన గోతులు ఏర్పడి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

తాడ్వాయి, జూలై 29: ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వ్యాధులబారిన పడకుండా మండలంలోని ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. సోమవారం పార్టీ స్థానిక కార్యాల యంలో సోవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని, ముఖ్యంగా బందాల, లవ్వాల, కొండపర్తి, కాటాపూర్ గ్రామాల్లో డెంగీ, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారని అన్నారు. ఈవిషయమై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి స్పందించి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు ధన్నూరి సంజీవయ్య, యానాల సిద్ధిరెడ్డి, జగదీశ్, భూషబోయిన రవికుమార్, పాక రాజేందర్, పిట్టల మహేందర్, చర్ప నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

గౌతమి నంది అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మహేష్, నాగేశ్వర్

మహదేవపూర్, జూలై 29: కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో డోలు వాయిద్యకారుడిగా పనిచేస్తున్న చిలుముల మహేష్‌కు విశ్వ విఖ్యాత ఆర్ట్స్ కల్చర్ అకాడమీ, శ్రీ గౌత మేశ్వర గోసంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గౌతమి బంగారు నంది పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి గో సంరక్షణ సమితి చైర్మన్‌ఆకుల విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేష్‌ను సత్కరించారు. ఎస్‌వీఆర్ డిజిటల్ చైర్మన్ ఎస్‌వీఆర్ వెంకటేశ్, అవధానుల ప్రసాద్, నృత్యకారిణి ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఉద్యోగికి ..

కాటారం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగి పుల్లూరి నాగేశ్వర్ గౌతమి బంగారు నంది పురస్కారం పొందారు. కళా సాహితీ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న ప్రముఖులకు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ, శ్రీ గౌతమేశ్వర గోసంరక్షణ సమితి మంత్రపురి సంయుక్తంగా బంగారు నంది, మయూర, ఐకాన్-2024 పురస్కారాలను అందజేసింది. సాహితీ రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా నాగేశ్వర్ పురస్కారాన్ని పొందారు. నిర్వాహకులు వెంకటేశ్, విద్యాసాగర్, దైవజ్ఞశర్మ, భాస్కర్‌శర్మ, ప్రభాకర్, శ్రీనివాస్, దొరబాబు, హంస, ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు.

వరల్డ్ హెరిటేజ్ వలంటీర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపూర్(రామప్ప), జూలై 29: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో కాకతీయ హెరిటేజ్ ఆధ్వర్యంలో అక్టోబరులో నిర్వహించనున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్‌కు అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌టాక్ కన్వీనర్ పాండురంగారావు, ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర పురావస్తుశాఖ, తెలంగాణ టూరిజం, ఇన్‌టాక్, ఐకోమస్ ఇండియా సహకారంతో వలంటీర్ క్యాంపెయిన్‌ను వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్ అనే థీమ్‌తో నిర్వహించనున్నట్లు తెలిపారు. చరిత్ర కళలు, ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజనీరింగ్, జియాలజీ బ్యాక్‌గ్రౌండ్‌తో డిగ్రీ పూర్తిచేసిన 18నుంచి 35ఏళ్లలోపువారు అర్హులని, ఆగస్టు 15వతేదీలోపు యునెస్కో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9989537268, 9441280606 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి : ఎస్టీయూ

ములుగు కలెక్టరేట్, జూలై 29: ఖమ్మం జిల్లాలోని ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరుప సతీష్‌కుమార్, ఏళ్ల మధుసూదన్‌లు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి క్రమశిక్షణలో పెట్టాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయురాలు శిరీష హెయిర్ కటింగ్ చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టకపోతే సమాజ విద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలు ప్రవర్తనను తప్పుపట్టడంతో సస్పెన్షన్ చేయడాన్ని ఎస్టీయూ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శిరీష సస్పెన్షన్ ఉపసంహరించుకుని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వెంకటాపురం(నూగూరు), జూలై 29: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న సెలవు ప్రకటించాలన్నారు. ఆదివాసీ గూడాల్లో ప్రపంచ ఆదివాసీ నోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పూనెం సాయి, మునేశ్వర్‌రావు, సతీష్, రాంచందర్, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల శిబిరం

ములుగు కలెక్టరేట్, జూలై 29: ఆర్టిఫిషియల్, లింబ్స్ మ్యానిఫ్యాక్చరింగ్ కార్పొరేన్ ఆఫ్ ఇండియా(ఏఎల్ఐఎంసీవో) ఆధ్వర్యంలో బుధవారం ములుగు జిల్లాకేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు డీఈవో పాణిని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో వైద్యనిపుణులు దివ్యాంగులు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే అర్హులైన దివ్యాంగులు ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం లేదా తెల్లరేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, సదరం సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్ లేనివారు ప్రభుత్వ వైద్యుడి దగ్గర పొందిన సర్టిఫికెట్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9705856344 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మొగుళ్లపల్లి, జూలై 29: మండలకేంద్రంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. న్నికలకు ముందు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎస్సీ బాలుర వసతిగృహంలో మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులందరికీ దుప్పట్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రేణికుంట్ల ప్రవీణ్, నేరెళ్ల జోసెఫ్, హరీష్, వినయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ

టేకుమట్ల, జూలై 29: 'చలో ఢిల్లీ-వంగపల్లి దీక్ష' కరపత్రాలను టీఎస్ ఎమ్మార్పీఎస్ మండల రేణుకుంట్ల రాము ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమను గెలిపిస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని బీజేపీ నెరవేర్చలేదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వ ద్ద దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. దీనిని మాదిగలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల దేవరాజ్. మండల నాయకులు రేణుకుంట్ల రాజ్ కుమార్, మారెపెల్లి మహేందర్, సరికొమ్ముల ప్రభాకర్, ఎలుకటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందజేత

గోవిందరావుపేట, జూలై 29: మండలకేంద్రానికి చెందిన దండోరా జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య కుమారుడు ఉదయ్ సాయికుమార్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నెమలి ఉదయ్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం, పండ్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సీఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవి మాట్లాడుతూ నెమలి ఉదయ్‌సాయి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లో కేంద్ర హోం అఫైర్స్ డిపార్టుమెంట్‌లో సెంట్రల్ బీసీ వెల్ఫేర్ కమిషన్ ఉద్యోగం చేసేవాడని, అంత పెద్దస్థాయిలో ఉద్యోగం చేస్తూ అకాలంగా మరణించడం ఆ కుటుంబానికి తీరనిలోటని అన్నారు. ఉదయ్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నెమలి భావన, సమగ్ర శిశు సంరక్షణ పథకం మండల సూపర్‌వైజర్ తులసి అనంతలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కొర్ర రఘురాం, పీఏసీఎస్ డైరెక్టర్ జెట్టి సోమయ్య, మహాజన సోషలిస్టుపార్టీ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు కణతల నాగేందర్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి జంపాల శేఖర్, జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్, ఉదయ్‌సాయికుమార్ తల్లిదండ్రులు నెమలి నర్సయ్య, స్వరూప, డాక్టర్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయాలి

చిట్యాల, జూలై 29: సేవాలాల్ సేన రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మహా సభల కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. రాజునాయక్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న బాబు జగ్జీవన్‌రామ్, హైదరాబాద్‌లో జరగనున్న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాఖాన్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శారదభాయి, నాయకులు వాలునాయక్, రాజు, పార్వతిబాయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

జంపన్నవాగులో తవ్వకాలు నిలిపివేయాలి

మేడారం, జూలై 29 : తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగులో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని ఆ గ్రామ అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన భోజరావు, ప్రధాన కార్యదర్శి గడిగా అనీల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేడారం దేవస్థానంలో భాగమైన జంపన్నవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, ఈ క్రమంలో యంత్రాల వల్ల స్నానఘట్టాలు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్మాణాలకు గోదావరి ఇసుక ఉండగా జంపన్నవాగు నుంచి తరలించడం సరికాదని పేర్కొన్నారు. జంపన్నవాగు నుంచి ఇసుక తీత వల్ల దాని పవిత్రకు భంగం వాటిల్లుతోందని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

'అసెంబ్లీకి వినతిపత్రం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, జూలై 29: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయించకపోవడాన్ని ఖండిస్తూ ఈనెల 31న నిర్వహించే అసెంబ్లీకి వినతిపత్రం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపునిచ్చారు. ములుగులో జిల్లాస్థాయి ఆటో యూనియన్ సమావేశం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల నరేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. రవికుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.వెయ్యికోట్ల బడ్జెట్ ప్రకటించాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, ఇన్సూరెన్స్‌బీమా, హెల్త్‌కార్డు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఆటో డ్రైవర్లు హరీష్, ఓంకార్‌చారి, కిరణ్, తిరుపతి, కుమార్, సాయి, సందీప్, నరేష్ వినయ్, కరుణాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.